## కామెడీ కథ

# ముల్లుపోయి...కత్తీవచ్చె...

ఠంగ్... ఠంగ్ మంటూ గడియారం సాయంత్రం ఏడు గంటలు కొట్టింది. తలెత్తి చూసాను. రామ్మూర్తి ఇంకా ఆఫీసులోనే వున్నాడు.

**ఆశ్చర్యం!**

రోజూ సాయంత్రం ఆరు కొట్టీకొట్టగానే ఠపీమని మాయమైపోయే రామ్మూర్తి ఆఫీసులో ఇంకా వున్నాడంటే ఆశ్చర్యమే మరి. అందుకే-

''ఇది కలా- నిజమా?'' అంటూ అడిగాను అతని సీటు దగ్గరికి వెళ్లి.

''కలవరం!'' అర్థం కాకుండా అన్నాడు.

''ఏడయ్యింది... '' టైం గుర్తు చేసాను.

''అవనీ- ఏడవనీ... నన్నేడవనీ'' అన్నాడు మరింత బాధగా.

''మగాడు ఏడిస్తే అందంగా ఉండదట'' నవ్వాను కొంటెగా.

''ఎవరా చెప్పింది..'' కయ్యిమన్నాడు

''సరే కానీ- ఇంతకీ నీ ఏడుపెందుకో చెప్పు'' అడిగాను- ఆరాతీస్తున్నట్టు.

''కొంపకి పోలేక'' కోపంగా అన్నాడు

''ఇంటికి పోలేనంటున్నావ్- ఇంత నీకు 'ఇంట్లో' బాధా-? లేక 'ఒంట్లో' బాధా' అడిగాను. అర్థం కానట్టు చూసాడు రామ్మూర్తి.

''ఇంట్లో బాధంటే, నువ్వు ఇంటికి వెళ్ళగానే మీ ఆవిడ ఇంట్లో అవి లేవు, ఇవిలేవు అని దండకం మొదలెట్టి, పండక్కి పట్టుచీర తేలేదనో... ఎదురింటి వెంకాయమ్మ వేసుకున్న వెల్వెట్ 'బ్లౌజ్' తనకు కొనివ్వలేదనో, 'కొరివి దెయ్యం'లా క్షణంక్షణం కాల్చుకు తినడం ఆఖరికి అన్నం పెట్టమని అడిగినా 'గుడ్లగూబలా' గుడ్లింతలు చేసుకుని గుండెలు పగిలేలా ఓ చూపు చూడటం-'' వివరంగా చెప్పాను.

''అబ్బే! అలాంటిదేమీ లేదు. మా ఆవిడ చాలా మంచిది''

''అలా అయితే నీది ఖచ్చితంగా 'ఒంట్లో' బాధే అయి వుంటుంది''

''అంటే?'' అనుమానంగా అడిగాడు

''ఒంట్లో బాధలంటే- నీ 'సంసారం'లో 'సారం' లేదని- కొత్తదనం కోసం నువ్వు కోరి కోరి ఏ ఎర్రలైటు 'ఏరియా'కో వెళ్లి కారణంగా వచ్చే చెప్పుకోలేని బాధల్ని వెంటతెచ్చుకున్నావా? అనీ. సుఖవ్యాధులకు దుఃఖిస్తూ ఏడైనా ఇంటికెళ్ళకుండా ఏడుస్తూ వున్నావా అనీ'' అర్థం వివరించాను.

''నా ఫేస్ చూస్తే నీకు అలా అనిపిస్తోందా?''

''ఆ సంగతి ఎంత పెద్ద డాక్టరైనా 'మొహం' చూసి ఎలా చెప్పగలడు?'' నవ్వాను.

''నా శీలాన్ని శంకించకు గురూ!'' ఏడుస్తూ నవ్వాడు రామ్మూర్తి.

''అంటే నీకు ఇంట్లో బాధలూ, ఒంట్లో బాధలూ లేవంటావ్''

''అవును''

''మరింకేం బాధలున్నాయి నీకు''

''ఛానల్ బాధలు''

''కొత్తగా మార్కెట్‌లోకొచ్చాయా''

''కాదు- కేబుల్ నుంచి నా కొంపలోకొచ్చాయి''

అర్థం కానట్టు ఫేస్ పెట్టాను.

''అర్థం కాలేదు కదూ- వివరంగా చెప్తాను విను... మొదట్లో మా ఇంట్లో నేనూ మా ఆవిడే వుండేవాళ్లం. భలే బోర్‌గా ఫీలయ్యేవాళ్లం. దాంతోపాటు మా అమ్మానాన్నలు, అత్తామామలు కూడా వుంటే బావుణ్ణు అని అనుకున్నాం. కలిసివుంటే కలదు సుఖం అని నినదించాం. దాంతో మా అమ్మానాన్న- మా ఆవిడ వాళ్ల అమ్మానాన్న... మా ఇంటికి వచ్చేశారు.

మొదట్లో అలా కలిసి వుండడంలో వున్న సుఖం నాకు బాగా తెలిసేది. అందరం హాయిగా అన్యోన్యంగా కాలం గడిపేవాళ్లం. హార్దికంగా, ఆర్థికంగా ఒకరి సహకారం మరొకరం అందుకుంటూ మల్లెలు వేరైనా 'దండ' ఒక్కటే మనుషులు వేరైనా మనసు ఒకటే... అన్నట్టు కలిసిమెలిసి వుండేవాళ్లం.

అందుకే ఎప్పుడెప్పుడు ఆరవుతుందా, ఎప్పుడెప్పుడు ఇంటికెళ్లి అందరితో హ్యాపీగా కబుర్లు చెప్పుకుంటూ ఎంజాయ్ చేద్దామా- అని ఎప్పుడూ ఎదురుచూసేవాణ్ణి'' చెప్పడం ఆపాడు రామ్మూర్తి.

''మరి కష్టం ఎక్కడొచ్చింది?'' ఆసక్తి ప్రదర్శించాను.

''అక్కడికే వస్తున్నా. నా టైం బాగోక ఈమధ్యనే కలర్ టీవీ కొని కేబుల్ కనెక్షన్ పెట్టించాను. దాంతో నాకు కష్టాలు మొదలయ్యాయి. దేశాల మధ్య ప్రపంచ యుద్ధాలు- గ్రహాల మధ్య 'స్టార్ వార్స్' ఎలా వుంటాయో నాకు తెలీదు. కానీ వాటన్నింటికన్నా భయంకరమైనవి మాత్రం 'ఛానల్ యుద్ధాలు' అని నాకు తెలిసొచ్చింది. కేబుల్ పుణ్యమా అని నట్టింట్లో నరకం కనిపిస్తోంది. అందరిళ్లలో 'సుబ్బులక్ష్మి', 'సుప్రభాతం'తోనో మరో దానితోనో రోజు ప్రారంభమవుతుంది. కానీ మా ఇంట్లో మాత్రం 'సన్ టీవీ' తమిళ పాటలతో మా 'తెలుగు' బతుకులు తెల్లారతాయి.

మా మావయ్య అంతకు ముందు చెన్నయ్‌లో ఉండొచ్చాడు. ఆయనకు తమిళ పాటలంటే తగని పిచ్చి. ఆయన తమిళ పాటలు అలా పెట్టి- ఆనందిస్తుంటాడో లేదో మా అత్తగారు తయారైపోతారు- 'మీటీవీ'లో చిన్ననాయరు స్వామి వారిని చూడడానికి.

తమిళం అని ఆయన స్వామి వారని ఆవిడ- రిమోట్ పట్టుకుని ఒకరు- టీవీని అంటిపెట్టుకుని మరొకరు- సగం తమిళం సగం తెలుగు.... తెలియని వాడెవడైనా మా వాకిట్లో నిలబడి వింటే మా 'టీవీ'కేదో తెగులు సోకిందని ఖచ్చితంగా అనుకుంటాడు.

ఒకే రంగు బట్టలుంటే స్కూలు పిల్లలకి మన స్పర్థలు రావని యూనిఫాం కనిపెట్టిన వాడెవడో కానీ వాడికి చేతులెత్తి మొక్కి- వెయ్యి కొబ్బరికాయలు కొట్టాలని అనిపిస్తుంది. కోతిపిల్లల్లా కీచులాడుకుంటోన్న వాళ్లను చూస్తుంటే.

ఆ గోల మధ్య ఆఫీసుకు వచ్చేస్తాను. సాయంత్రం ఇంటికి చేరేసరికి ఛానల్ యుద్ధం చాలా తీవ్రంగా వుంటుంది.

రంభ అని ఒకరు- బాబాయి అని ఇంకొకరు- మావయ్య అని మరొకరు శ్రీవారు అని వేరొకరు- ఇంటిని 'అశాంతి నిలయం'గా మార్చేస్తూ... పోరాడుతుంటారు. తిండీ అక్కడే- తిప్పలూ అక్కడే- ఇంట్లో బోలెడన్ని రూములున్నా... జనమంతా హాల్లోనే బెల్లం చుట్టూ ఈగల్లాగా టీవీ చుట్టూ కూర్చుని కేకలేస్తుంటారు.

'న్యూస్ హైలైట్స్' అయ్యాకే ఏదైనా చూడండంటూ ఒకరు- 'అజితాబ్' అడిగే ఏ ఒక్క ప్రశ్న మిస్ అయినా ఘోరం జరిగిపోతుందని ఒకరు-



‘నిధి’ సీన్ కొంచెం చూడకపోతే కొంపలంటుకుంటాయని మరొకరు- ఒకటే గోల! రోడ్డున పడ్డ రొట్టెముక్క మీద గుంపుగా నాలుగు కాకులు పడి చేసే వెధవ కాకిగోల!

ఆ తరువాత ‘అపవిత్ర సంబంధం’ గురించి- ‘విడిపోదాంరా’ గురించి, ‘పప్పు బెల్లాల’ గురించి... ‘అపనమ్మకం’ గురించి పోరాడి పోరాడి చివరకు ఏ అర్థరాత్రో అలిసిపోతారు...

ఆపాటికి నాకు, మా ఆవిడకు ఒక నిద్ర పూర్తవుతుంది. ఇదంతా ఒక ఎపిసోడ్ అయితే- అప్పటి నుంచి మరో అసలుసిసలు ‘నరకం’ ఎపిసోడ్ ప్రారంభమవుతుంది’’ మధ్యలో ఆపి మంచినీళ్లు తాగాడు రామ్మూర్తి.

‘‘ఏమా నరకం- ఏమా కథ’’ అడిగాను ఆసక్తిగా.

ఒక్క క్షణం నావైపు అదోలా చూసి మళ్లీ చెప్పడం మొదలెట్టాడు రామ్మూర్తి.

‘‘ఆ నరకం గురించి- ఒకే ఒక్క ఉదాహరణ

పుట్టా శ్రీధర్

చెప్తాను. విను...

ఓరోజు అర్థరాత్రి- నిద్రపోతున్న నాకు ఏవో ఏడ్పులు వినిపించాయి. ఏడుస్తున్నదెవరో అర్థం కాలేదు. నా భార్యను లేపాను. ఆమెకూ ఏమీ అర్థం కాలేదు. ఇద్దరం హడావుడిగా బెడ్‌రూం తలుపులు తీసుకుని హాల్లోకి పరుగెత్తుకు వెళ్లాం. ఏడుపులు పక్క గదిలోంచి వినిపిస్తున్నాయి.

అది మా అత్తామామల గది!

తలుపులు తోసుకుని లోపలికి దూసుకు వెళ్లాం. మంచం మీద కూర్చుని మా అత్తగారు భోరుభోరుమని ఏడుస్తున్నారు. మామగారు ఆమెను సముదాయిస్తున్నారు. ‘ఊరుకో జానకీ ఊరుకో’ అంటూ.

‘‘అమ్మా ఏమయింది?’’ అడిగంది నా భార్య ఏడుస్తూ.

‘‘మామయ్యా ఏం జరిగింది?’’ నాకూ యమ టెన్షన్‌గా వుంది.

‘‘సుంకన్న చచ్చిపోయాడు’’ వెక్కిళ్ళ మధ్య చెప్పింది అత్తయ్య.

''ఎప్పుడు?''

''ఈరోజు మధ్యాహ్నం''

''అయ్యో! '' మా ఆవిడ, అత్తయ్యతో కలిసి కోరస్‌గా ఏడుస్తోంది.

''ఇంతకీ ఈ సుంకన్న ఎవరు?'' అడిగాను అయోమయంగా.

''సుంకన్న ఎవరో తెలీదా? సుంకన్న ఎవరో తెలీదంట. అయ్యో దేవుడా...'' చేతో తలబాదు కుంటూ అత్తయ్య ఇంకా గట్టిగా ఏడుస్తోంది.

ఆమె ఏడుపుకి మా ఆవిడ కోరస్ పాడు తోంది. విషయం- అర్థం అయ్యీ అవక నేను పిచ్చిగా జుట్టు పీక్కున్నాను.

ఆ రాత్రంతా ఆ గదిలోనే గడిచిపోయింది.

ఆ ఏడుపుల మధ్య ఎలాగో తెల్లారింది.

తెల్లారాక తెలిసిన సంగతి విని నా బ్రతుకు నిజంగానే తెల్లారిపోయింది. ఆ చచ్చిపోయిన సుంకన్న మా చుట్టమూ కాదు, తెలిసిన వాడు అంతకన్నా కాదు- 'బూతురాగాలు' అనే సీరియల్‌లో వచ్చే ఓ క్యారెక్టర్ పేరట అది. నిన్న మధ్యాహ్నం ఆ పాత్ర చచ్చిపోయిందట. ఆ విషయాన్ని తల్చుకుని తల్చుకుని మా అత్తగారు భోరుభోరుమని రాత్రంతా ఏడ్చిందట. హే భగవాన్! ఏమిటీ శిక్ష! ఎందుకు నాకీ అగ్నిపరీక్ష! నాకు పిచ్చెక్కుతున్నట్టు అనిపించింది.

ఒకరోజు బూతురాగాలు సుంకన్న మరో రోజు 'దస్తూరి' జంబులన్న...చచ్చిపోయిన పాత్రల గురించి... జరిగిపోయిన సంఘటనల గురించి... 'ఓబులేసు'ని

**డ్రీమ్ బాయ్**

**'నా తుమ్ జానో నా హమ్', 'రెహ్నా హై తేరే దిల్ మే' చిత్రాల ద్వారా టీనేజ్ అమ్మాయిల దృష్టిలో డ్రీమ్ బాయ్‌గా పేరుతెచ్చుకున్న సయీఫ్ అలీఖాన్ 'నేనేమీ ప్రేమలో పడ లేదు' అంటున్నాడు. అంతేకాదు 'రొమాంటిక్ పాత్రలకే నేను పరిమితం కాదలచుకోలేదు. స్క్రిప్ట్ బాగుంటే ఎలాంటి సినిమాల్లోనైనా నటించడానికి సిద్ధంగా ఉన్నాను' అని చెబుతున్నాడు.**

పోలీసులు పట్టుకుపోయారని, 'మందం'లో చందర్, మరదలు నడుం గిల్లాడని- 'ఎవర్రా భిక్షపతి' ప్రోగ్రాంలో ఓ చిన్నపాటి ప్రశ్నకు పది లక్షలు ఇచ్చారని... ఇలా అర్థంలేని వాదనలతో దిక్కుతోచని చిత్రవిచిత్ర హింసలు...

ఒకరోజు అత్తామామల గదిలో ఏడ్పులు విని పిస్తే- మరోరోజు అమ్మానాన్నల రూంలో రోదనలు వినిపించేవి. కర్మ కాలితే- రెండు గదుల్లోనూ ఒకేసారి వచ్చేవి. జుట్టు పీక్కుని, దిక్కుతోచక కుళ్లిపోవటం తప్పితే, నేను మా ఆవిడ ఏం చేయాలో తెలీక బిక్కచచ్చిపోయేవాళ్లం.

ఇలా సాగి, సాగి...ఆ... ఛానల్ యుద్ధాలు, మానవసంబంధాల దాకా ప్రాకి, మా కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశాయి. అనుక్షణం పోరుతో, ఇల్లు కార్గిల్ యుద్ధరంగంలా మారిపోయింది. ఒకరంటే ఒకరికి పడడం లేదు. అనుబంధాలు, ఆప్యాయతలు... అన్నీ ఎండమావుల్లా మారిపోయాయి. అందమైన 'పూల తోట' లాంటి మా ఇల్లు ఇప్పుడు 'నరకం'లా కనిపిస్తోంది.

అందుకే ఇంటికంటే ఆఫీసు పదిలమని ఇక్కడే వున్నాను'' సంగతంతా పూసగుచ్చినట్టు చెప్పాడు రామ్మూర్తి.

నేను ఆలోచనలో పడ్డాను. అలా చాలాసేపు ఆలోచించి, 'మర్యాదరామన్న'లా ఓ సలహా ఇచ్చాను.

''ఇన్ని అనర్థాలకు మూలమైన ఆ కేబుల్ కనెక్షన్ని కట్ చేయించు. తద్వారా ఇంట్లో పూర్వంలా అనుబంధాన్ని పెంపొందించు'' అంటూ.

నా సలహా రామ్మూర్తికి పిచ్చగా నచ్చినట్టుంది. 'సరే'నంటూ తలూపి, సర్రుమని లేచి ఇంటికి వెళ్లాడు.

కొద్దిరోజుల తర్వాత రామ్మూర్తి ఆరు కాగానే ఆఫీసు నుంచి మాయమవడం మళ్లీ మొదల యింది.

★ ★ ★

నెలరోజులు గడిచాయి.

ఒక రోజు-

సాయంత్రం ఏడయింది.



ఆశ్చర్యం!

ఏడైనా రామ్మూర్తి ఇంకా ఆఫీసులోనే వున్నాడు.

''ఏం జరిగింది?'' అని అడిగాను ఆసక్తిగా.

రామ్మూర్తి మౌనంగా ఉన్నాడు.

''మొన్నీమధ్య పుట్టిన మీ పాప మొదట అమ్మమ్మ అంటుందని ఒకరు, నాన్నమ్మ అంటుందని మరొకరు, ఇవేవీ కాదు తాతయ్య అంటుందని వేరొకరు- ఇలా పందాలు వేసుకుని 'బంగారం' దగ్గర నుంచి 'భూములు' దాకా అన్నీ ఆ పందెంలో పెట్టుకుని, మొదట ఎవర్ని పిలుస్తుందని టెన్షన్ పడుతుంటే ఆ పాప అమ్మమ్మ అనకుండా నాన్నమ్మ అనకుండా తాతయ్య అనో మావయ్య అనో అనకుండా చివరికి అమ్మానాన్న అని కూడా అనకుండా అందర్నీ ఖంగు తినిపిస్తూ 'పిన్నీ' అని సీరియల్ స్టయిల్లో అందా?'' అన్నాను రామ్మూర్తిని నవ్వించడానికి ప్రయత్నిస్తూ.

''అబ్బా అలాంటిదేం జరగలేదు గురూ!'' అన్నాడు బాధగా.

''మరేం జరిగింది?''

''మా అత్తయ్యకు- 'పున్నామనరకం' సీరియల్ క్విజ్ కాంపిటీషన్‌లో ఓ ప్రయిజ్ వచ్చింది. కేబుల్ కనెక్షన్ తీయించక ముందు రాసి పంపిందట''

''ప్రయిజ్ వస్తే సంతోషపడాలి కానీ నువ్వేంటి ఇంతలా బాధపడుతున్నావ్?''

''వచ్చింది కేజీ బంగారమో అరకేజీ వెండో అయితే ఆనందించేవాడిని''

''మరి....''

''ప్రయిజు కింద ఓ 'డిష్ యాంటెన్నా' ఇచ్చారు. దాంతో నూట ఇరవై ఛానళ్లు చూడొచ్చు''

''లక్కీ ఫెలోవి గురూ!''

''లక్కా నా బొంద... నలభై ఛానళ్లు వచ్చేలా చేసే కేబుల్ కనెక్షనే మా ఇంటిని సర్వనాశనం చేస్తోందని పీకించేస్తే ప్రయిజు కింద సర్‌ప్రయిజ్‌గా ఈ నూట ఇరవై ఛానళ్లు అందించే డిష్ యాంటెన్నా వచ్చింది.

ముల్లు పోయిందనుకుంటే ఈ కత్తి వచ్చింది. ఇక నా బ్రతుకు బస్టాండే గురూ!'' అంటూ ఆరున్నొక్క రాగాన్ని అందుకున్నాడు రామ్మూర్తి.

అతన్నెలా ఆదుకోవాలో అర్థంకాక నేను పిచ్చిగా జుట్టు పీక్కున్నాను.